# ఇందిరమ్మ ఇళ్లతో పేదల గృహాల్లో నూతన వెలుగులు

## ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, జూన్ 01 (తెలంగాణ వాణి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ వారోత్సవాలలో భాగంగా సోమవారం టేకులపల్లి మండలంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమాలు పండగ వాతావరణంలో జరిగాయి. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య టేకులపల్లి, గోల్యతండా, 9వ మైల్ తండా, బేతంపూడి, రోళ్లపాడు గ్రామ పంచాయతీలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో నిర్మించిన నూతన ఇళ్లను ఇంటి యజమానులతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారులైన దంపతులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి, స్వీట్లు తినిపించి వారి నూతన గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు అలాగే మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానుందని ఆయన వెల్లడించారు. ఈ గృహప్రవేశాల మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్,కోరం సురేందర్,ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్,జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్,హౌసింగ్ ఏఈ గణేష్,కే ఓ సి యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చా సుధాకర్ పాల్గొన్నారు.అలాగే సర్పంచులు బానోత్ పూర్ణ,సుభాష్ చంద్ర బోస్,ఊకె సునీతలతో పాటు మండల నాయకులు ఈది గణేష్,పోశాలు,రెడ్యానాయక్, లక్ష్మయ్య,భద్రు,సర్దార్,రమేష్,దేవ్ సింగ్,ఈశ్వర్, సక్కోకుమార్, రాందాస్,లవకుమార్,శివాజీ మరియు స్థానిక ప్రజలు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలవరం ముంపు ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకోం

**సిడబ్ల్యూసి కమిటీ సర్వే పక్కాగా జరగాలి**

**కరకట్ట రక్షణ గోడ నిర్మాణ పనులు**

**కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షించాలి**

**బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**




**కొత్తగూడెం, జూన్ 01 (తెలంగాణ వాణి)** పోలవరం అథారిటీ ప్రాజెక్టుకు సంబంధించి సిడబ్ల్యూసి కమిటి ముంపు ప్రాంతాలైన భద్రాచలం, పినపాక నియోజకవర్గంలో ఈనెల మూడు నాలుగు తేదీల్లో పర్యటిస్తున్న సమాచారాన్ని గొప్పంగా ఉంచడం పట్ల బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు సిడబ్ల్యూసి కమిటీ పర్యటన తూతు మంత్రంగా తమ పర్యటన ముగించే విధంగా ఉందని విమర్శించారు. బ్యాక్ వాటర్ తో భద్రాచలం, బూర్గంపహాడ్, ఐటీసీ సంస్థ ముంపుకు గురయ్యే అవకాశం ఎక్కువ ఉన్న నేపథ్యంలో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన కమిటీకి సూచించారు. ఇదే విషయమై గతంలోను బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు ముంపు ప్రాంతాల వివరాలు కమిటీకి అందించి ముంపు ప్రాంతాల వారికి న్యాయం జరిగేలా చూడాలని రిప్రజెంటేషన్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. కమిటీ పర్యటన నేపథ్యంలో మరోసారి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముంపు బాధిత ప్రజల పక్షాన కమిటీని కలిసి మరోసారి రిప్రజెంటేషన్ ఇస్తామని, ప్రత్యేకంగా ముంపు ప్రాంత పర్యవేక్షణ కమిటీ పేరుతో ప్రధాన ప్రతిపక్ష కమిటీ ఏర్పాటు చేసి ఆంధ్ర రాష్ట్రం కంటే మెరుగైన ప్యాకేజీ అందేలా చూస్తామని, గతంలో వచ్చిన వరదల వల్ల జరిగిన నష్టాన్ని పరిగణలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వమే అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కంపెనీకి ద్వారా రక్షణ గోడలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్ లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాలమ్మ కుంటకు బందోబస్తు కల్పించాలి

## అధికారులకు మత్స్యకారుల వినతి




**టేకులపల్లి జూన్ 01 (తెలంగాణ వాణి)** మండల పరిధిలోని ముత్యాలమ్మ కుంటలో అనధికారిక చేపల వేటను అరికట్టడానికి రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం మత్స్యకారులు స్థానిక అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు ముత్యాలమ్మ కుంట వద్ద బందోబస్తు నిర్వహించాల్సిందిగా జిల్లా మత్స్యశాఖ అధికారి...స్థానిక ఎస్ హెచ్ ఓ కి లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను మత్స్యకారులు టేకులపల్లి తహసీల్దార్‌కు, బేతంపూడి గ్రామ సర్పంచ్‌కు అందజేసి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ..గత ఏడాది కుంటలో వేసిన చేప పిల్లలు భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయాయని తెలిపారు. ఆ తర్వాత ఆలస్యంగా చేప పిల్లలను వదలడం వల్ల అవి ఇంకా పూర్తిగా ఎదగలేదని, అందుకే ఈ సంవత్సరం తాము ఇంకా చేపల పట్టుబడి (వేట) ప్రారంభించలేదని వివరించారు. ఈ తరుణంలో సొసైటీకి చెందని వ్యక్తులు ఎవరూ అనధికారికంగా చేపలు పట్టకుండా ముత్యాలమ్మ కుంట వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం సభ్యులు సీతారాములు, లకపతి, రామోజీ, లచ్చిరాం, రాజు, బద్దు, బాల్య, శ్యాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన స్టే వైర్

## గోల్యతండా సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం



**టేకులపల్లి, జూన్ 01 (తెలంగాణ వాణి)** టేకులపల్లి మండలం గోల్యతండా గ్రామంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం స్థానిక ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. తండాలోని భూక్యా లాలు, బోడ హచయ నివాసాల ఎదుట నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ స్తంభం, దానికి అనుసంధానంగా ఉన్న స్టే వైర్ ప్రస్తుతం మృత్యుకుహరంగా మారాయి. రోడ్డు నిర్మాణ సమయంలోనే ఈ స్తంభాన్ని తొలగించాల్సి ఉన్నప్పటికీ, అధికారుల సమన్వయ లోపం కారణంగా దీనిని అలాగే వదిలేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ఆ స్టే వైరుకు విద్యుత్ సరఫరా (పవర్ లీకేజ్) అవుతోందని గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ వీధిలోనే చిన్న పిల్లలు నిరంతరం ఆడుకుంటూ ఉంటారని, ప్రమాదవశాత్తు ఆ వైరును తాకితే జరిగే అనర్థానికి బాధ్యులెవరని తండావాసులు మండిపడుతున్నారు. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణాలు పోకముందే అధికారులు మేల్కోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సీసీ రోడ్డు మధ్యలో ఉండి నిత్యం ప్రాణసంకటంగా మారిన ఈ విద్యుత్ పోల్ మరియు స్టే వైరును తక్షణమే సురక్షిత ప్రాంతానికి మార్చాలని గోల్యతండా ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఈ అత్యంత ప్రమాదకరమైన సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి గ్రామస్థుల, చిన్న పిల్లల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చర్మకారుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు : ఎమ్మార్పీఎస్ నాయకులు



**కొత్తగూడెం, జూన్ 01 (తెలంగాణ వాణి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్మకారుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం బస్టాండ్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అనుమల వీరయ్య అధ్యక్షతన చర్మకారుల జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కూసుపాటి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులు వేలేటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు గంగపురి శ్రీనివాస్, దాసరి సారధి, జిల్లా సలహాదారు హాజరయ్యారు. 25 మంది సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేయగా, సత్తాల యశ్వంత్ కుమార్‌ను జిల్లా కార్యదర్శిగా, అనుమల వీరయ్యను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనుమల వీరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగపురి శ్రీను మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుంటూ జీవిస్తున్న చర్మకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. లిడ్‌క్యాప్ సంస్థ ద్వారా శిక్షణ పొందిన సుమారు 1000 మంది చర్మకారులు జిల్లాలో ఉన్నారని, వీరంతా రానున్న కాలంలో ఐక్యంగా ఉద్యమాలు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను నిరుపేద చర్మకారులకు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇనుపనూరి బాబు, వలస సీతారాములు, పెద్దపూడి ప్రకాష్, దాసరి రమేష్, సత్తాల యశ్వంత్ కుమార్, అందాల ప్రసాద్, దాసరి వెంకటరమణ, దాసరి లక్ష్మి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వసుంధర షాపింగ్ మాల్ అధినేత "తాటిపల్లి" జన్మదిన వేడుకలు

**ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు" తాటిపల్లి" ని సన్మానించిన పట్టణ ప్రముఖులు**

**దేవాలయాల అభివృద్ధికి రు. 1.51 లక్షలు అందించిన శంకర్ బాబు**

**పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలతో సత్కారం**



**కొత్తగూడెం, జూన్ 01 (తెలంగాణ వాణి)** ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు,



వసుంధర షాపింగ్ మాల్ అధినేత తాటిపల్లి శంకర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని శంకర్ బాబు దంపతులను పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. సోమవారం శంకర్ బాబు జన్మదినోత్సవంతో పాటుగా పక్కనే ఉన్న భవన గృహప్రవేశం చేసిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు నూతన వస్త్రాలను అందించి సత్కరించారు. విధంగా విద్యానగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి లక్ష రూపాయలను ఆలయ నిర్వహకులు అందజేశారు. కార్పొరేషన్ పరిధిలోని



29వ డివిజన్లోని నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ గణేష్ దేవాలయ అభివృద్ధికి రు. 51 వేల రూపాయలను ఆలయ నిర్వాహకులు గుడి కృష్ణ, రమేష్ లకు తాటిపల్లి శంకర్ బాబు దంపతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనను అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. శ్రీ తాటిపల్లి సేవా సంస్థ ద్వారా పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు దుస్తులు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు, వ్యాపారులు, సామాన్య ప్రజలతో సహా అనేకమంది శంకర్ బాబు దంపతులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.



## కొత్తగూడెంలో రాపిడో వ్యవస్థను రద్దు చెయ్యాలి



**కొత్తగూడెం, జూన్ 01 (తెలంగాణ వాణి)** కొత్తగూడెం పట్టణంలో అమలవుతున్న రాపిడో వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాపిడో వ్యవస్థ కారణంగా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో డ్రైవర్లు తమ కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టతరంగా మారిందని పేర్కొన్నారు. ఒకవైపు ఫైనాన్స్ సంస్థల వేధింపులు, మరోవైపు పెరిగిన ఆర్టీఏ చలానాలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, విడిభాగాల ధరలు డ్రైవర్లపై అదనపు భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, పిల్లల విద్యా ఖర్చులు, కుటుంబ సభ్యుల వైద్య ఖర్చులు భరించలేక అనేక మంది ఆటో డ్రైవర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత చదువులు పూర్తి చేసిన అనేకమంది ఉద్యోగ అవకాశాలు లేక ఆటోనే జీవనాధారంగా ఎంచుకుని కుటుంబ పోషణను నెట్టుకొస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో రాపిడో వ్యవస్థ ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని వివరించారు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడేందుకు కొత్తగూడెంలో అమలవుతున్న రాపిడో వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు చల్లంగి శ్రీనివాస్, గంగులు, సుధాకర్, మహమ్మద్ నూరు, శోభన్, సర్వయ్య, పాషా, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే

**సింగరేణి యాజమాన్యం ఎంపిక చేసిన ఉత్తమ ఉద్యోగులకు సన్మానం**

**12 ఏరియాల నుంచి 16 మంది సింగరేణి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక**

**కొత్తగూడెం సింగరేణి, జూన్ 01 (తెలంగాణ వాణి)** 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థలోని 12 ఏరియాల నుంచి 16 మంది ఉద్యోగులను యాజమాన్యం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసింది. విధులకు క్రమం తప్పకుండా హాజరవుతూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం, భద్రతా నిబంధనలు పాటించడం, ప్రమాదరహిత పనితీరును కనబరచడం, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో విశేష కృషి చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వీరిని ఎంపిక చేసినట్లు జీఎం (పర్సనల్), వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే. అజయ్ కుమార్ తెలిపారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలో పి. మహేష్ కుమార్, దార్ల సంతోష్ కుమార్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కేకేఓసీపీ, మందమర్రి ఏరియా), బి. మోహన్ దాస్ (హెడ్ ఓవర్‌మ్యాన్, ఎస్ఆర్పీ-3 ఇంక్లైన్, శ్రీరాంపూర్ ఏరియా), కప్పాల ప్రసాద్ (ఎస్ఈ--ఐఅండ్ఎం, ఎలక్ట్రికల్, ఎస్టీపీపీ), జంగేటి సమ్మయ్య (కన్వేయర్ ఆపరేటర్--సర్ఫేస్, సీహెచ్‌పీ, ఆర్జీ-1 ఏరియా), టి. రామ్ మోహన్ (ఈపీ ఆపరేటర్, ఓసీపీ-3, ఆర్జీ-2 ఏరియా), బైరి రమేష్ (అడిషనల్ మేనేజర్, ఓసీపీ-1, ఆర్జీ-3 ఏరియా), సీహెచ్. బాలరాజు (ఎస్ఈ--ఈఅండ్ఎం, ఏఎల్‌పీ, ఏపీఏ ఏరియా), కే. రాజయ్య (ఫిట్టర్, కేటీకేఓసీ-2, భూపాలపల్లి ఏరియా), ఆర్. శ్రీనివాస్ (ఏజీఎం--ఈఅండ్ఎం, మణుగూరు ఏరియా), లకావత్ అశోక్ (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కేఓసీ, ఇల్లందు ఏరియా), జి. లక్ష్మీనారాయణ (హెచ్ఓఎం, వీకే-సీఎం, కొత్తగూడెం ఏరియా), భూక్యా రాంబాబు (డిప్యూటీ ఎస్ఈ--ఈఅండ్ఎం, జేవీఆర్-సీహెచ్‌పీ, సత్తుపల్లి ఏరియా), పి. మురళీకృష్ణ (జనరల్ మేనేజర్--ఈఅండ్ఎం, టెక్నికల్ సర్వీసెస్, కార్పొరేట్), ముకుంద సత్యనారాయణ (డీజీఎం--పర్సనల్, ఏటీబీ సెల్, వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్, కార్పొరేట్), ఎన్. కుమారస్వామి (ఫోర్‌మన్--ఎలక్ట్రికల్, మెయిన్ వర్క్‌షాప్, కార్పొరేట్) ఉన్నారు.